

# మృత్యువు

శ్రీరాజ్

అరవై యేళ్ళు నింపుకొని, రిటైరయిన తాసిల్దారుగా మిగిలిపోయిన రాఘవయ్యగారు మృత్యువుతో పోరాటం సాగిస్తున్న చివరి క్షణాల్లో బరువుగా కళ్ళు తెరిచి చుట్టూ చూశారు. అంతా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. మనసు చాలా తెలివిగా పని చేస్తుంది. బహుశా తనకు చావు తెలివి' వచ్చిందని మనసులో అనుకున్నారు.

చీకటి పడుతుంది.

వార్డులో లైట్లన్నీ వెలిగాయి.

రోగుల్ని పరామర్శించడానికి వచ్చిన విజిటర్సుని వెళ్ళిపొమ్మని నర్సులు తొందర చేస్తున్నారు. కదల్లేని పేషెంట్లు ఉన్న చోటనే తమను చూడ్డానికి వచ్చినవాళ్ళతో కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. ఓపిక ఉన్నవాళ్లు బాల్కనీ చివరికెళ్ళి లాన్‌లో పూలమొక్కల్ని కాలక్షేపంగా చూస్తున్నారు. గాలికి బెడ్సు దగ్గర వున్న కేస్ షీట్సు రెపరెప లాడుతున్నాయి.

తనకూ - ఒకసారి లేచి బాల్కనీ చివరికెళ్లి రావాలనిపించింది. ఒంట్లో శక్తి అంతా కూడదీసుకొని, వార్డంతా కలియ దిరిగి రావాలనే కోరిక కలిగింది. కానీ, తనెందుకు వెళ్ళాలి? ఎవరికోసం ఎదురు చూడాలి?

రాఘవయ్యగారు ప్రక్కకి చూశారు.

జీవితంలో కష్టం సుఖం అన్నీ తనతో సమానంగా అనుభవించిన తన అర్ధాంగి జానకి తనదగ్గర కూర్చుంది. ధారాపాతంగా కన్నీరు విడుస్తుంది. ఆ కన్నీటి వెనుక దాగిన ఆవేదన తనకు బాగా తెలుసు. విధ్యుక్తంగా తన ఇల్లాల్ని విడిచిపెట్టి, జీవితసంగ్రామంనుంచి తప్పుకొని వెళ్లిపోయే ఆఖరి క్షణాలు దగ్గర పడుతున్నాయి. ఒంటరివాన్ని చేసి, తన గమ్యం చేరుకోవాలనే తొందర ఎక్కువ అవుతుంది. ఆమె కన్నీటిని ఆపే శక్తి తనకు లేదు. ఆ కన్నీటికి ఆనకట్ట వేయటం సాధ్యం కాదు. తనకు తెలియకుండా కన్నీరు కారి, చెంపలమీదికి జారి గుండెను బరువు చేసింది.

కళ్లు మూసే ముందు, కళ్ల ముందు గతం అంతా పిచ్చిగా గీచి విడిచిన చిత్రంలా కనిపించింది. ఎన్నో అనుభవాలు సుడులు తిరిగాయి. ఆ ఆఖరిక్షణాల్లో కూడ రాఘవయ్యగార్ని ఎన్నో ఆలోచనలు కలవరపెట్టాయి.

కన్నవాళ్లు-కావలసినవాళ్లు, అనుకున్న వాళ్లు దూరంగా వెళ్లిపోయారు. చేతికంది, చేయూతనిస్తారనుకున్నవాళ్లు రెక్కలు వచ్చి, ఎవరి దారి వారు వెదుక్కున్నారు. తనూ వెళ్లిపోతే జానకిని చూసేవాళ్లు వుండరు. జానకి ఏమైపోతుందో? ఆమె బతుకెలా సాగుతుందో? తనకు చిన్న కష్టం కలిగితే, జానకి విలవిల్లాడిపోయేది. తనిప్పుడు ఆమెను కష్టాల్లో వదిలి వెళ్లి పోతున్నాడు.

"జానకీ!" బరువుగా భార్యను పిలిచారు రాఘవయ్యగారు.

జానకి కళ్లు ఒత్తుకొని, భర్త వేపు ఆత్రంగా చూసింది.

"జానకీ! నేను పోతే నువ్వెలా బతకగలవో అని ఆలోచిస్తున్నాను." రాఘవయ్యగారు గాద్గదికంగా పలికారు.

"వద్దండీ .... అలా ఆలోచించకండి. మీరు నాకోసం బతకాలి." పెల్లుబుకుతున్న దుఃఖాన్ని ఆపుకుంటూ, అతన్ని వారించటానికి జానకి ప్రయత్నించింది.

"చూడు, జానకీ! .... ఈ తెల్లటి గోడలు, ఎర్రటి పూలు, పచ్చటి దుప్పట్లు, ఈ నల్లటి తెల్లటి మనుషులు - వెలుగులో అన్నీ అలాగే అందంగా కనిపిస్తాయి. కానీ, చిక్కటి చీకటి ఏర్పడినప్పుడు అన్నీ తమ రూపాలు కోల్పోయి ఒకే రంగులో చీకటిలో కలిసిపోతాయి. ఈ రంగుల

భేదం ఉండదు....అంతే, జానకీ! జీవితంలో సమస్యలు కూడ ఊపిరి ఆగిపోయి, ఈ చిన్న ప్రాణం గాలిలో కలిసిపోయినప్పుడు నిన్ను గురించి మరి ఆలోచించలేను. నాకు ఏలాంటి సమస్యల్లూ ఉండవు....అందుకే ఈ ఊపిరి కొట్టుకున్నంతసేపు నీకోసమే ఆలోచించాలనిపిస్తుంది.''

జానకి దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది.

రాఘవయ్యగారి రెండు చేతులు తీసుకొని, తన హృదయానికి హత్తుకుంది. ఏమీ మాట్లాడలేకపోయింది. ముసురుకుంటున్న అనుమానాలతో గుండెలనిండా ధైర్యాన్ని పెంచుకొనే ధైర్యంలేక బిక్కుబిక్కుమని చూస్తూంది.

కొన్ని క్షణాలు మౌనంగా గడిచిపోయాయి.

వార్డులో జనం పలచబడ్డారు.

డాక్టర్లు రౌండ్సు తిరుగుతున్నారు.

''జానకీ!....మన పిల్లలెవరూ రాలేదు కదూ?'' రాఘవయ్యగారు నిరాశగా అడిగారు. ఎవరూ తనను చూడకపోయినా, తనను విదిలించుకుపోయినా వాళ్లమీద ఆపేక్ష మిగిలిపోయింది. చనిపోయే ముందు ముగ్గురు కొడుకుల్నీ చూడాలని, వాళ్ళ చేతులమీద పోవాలనే తపన ఉండిపోయింది. ఆ మమకారం అలాంటిది.

''వస్తారండీ....అన్నయ్య—పెదబాబుకి చినబాబుకి టెలిగ్రాము లిచ్చాడు. చంటి కూడ వచ్చేస్తాడు....'' కొడుకులు వస్తారని, కన్నతండ్రి నోట్లో తులసినీళ్ళు పోస్తారని ఆమెకి ఏ కోశానా ఆశ లేదు. రాఘవయ్యగారి తృప్తికోసం అన్న మాటలవి.

జానకి అన్నయ్య సుందర్రావు - పెద్దవాళ్ళిద్దరికీ రాఘవయ్యగారిని ఆసుపత్రిలో చేర్చిన మరుక్షణమే ఉత్తరాలు రాశాడు. అవసానదశలో ఉన్న తండ్రిని చూడ్డానికి రమ్మని. ఎవరూ రాలేదు. కనీసం ఉత్తరాలైనా రాయలేదు. తర్వాత-డాక్టర్లు రాఘవయ్యగారి పరిస్థితి బాగా లేదన్నారు. ఆలస్యం కాకుండా అయినవాళ్ళకి కబుర్లు చేయమన్నారు. వెంటనే సుందర్రావు టెలిగ్రాము లిచ్చాడు. ఇద్దరిలో ఏ ఒక్కరికీ ఏ కొంచెం అభిమానం ఉండి కూడ రాలేదు. వాళ్లు పూర్తిగా మారిపోయారు. కన్నవాళ్ళను మరిచిపోయారు. మరిచారు అనుకుంది జానకి. మూడో వాడు నాటకాలంటూ అయిపూ అడ్రసూ లేకుండా వెళ్ళిపోయాడు. ఎప్పుడు వస్తాడో ఎవరికీ తెలియదు. పగవాడికైనా తన లాంటి దౌర్భాగ్యం కలగకూడదని మనసులో ఆక్రోశించింది.

''జానకీ! .... వాళ్లు రారు. నా కా అదృష్టం లేదు. నన్ను వెలివేశారు.... వాళ్లని నేను చూడలేను. నా కంటె ముందే నా ఆశ చచ్చిపోయింది....'' ఈ సారి రాఘవయ్యగారు మూలిగారు. మామూలుగా కాదు. బాధతో. వెచ్చటి కన్నీటితో. చంపుకోలేని మమకారంతో.

రాఘవయ్యగారి చూపులు సన్నగిల్లాయి.

మనసు పూర్తిగా శూన్యమైపోయింది.

మిగిలిపోయిన బంధాలకోసం - అన్వేషణలో అతని దృక్కులు నిలిచిపోయాయి.

కనిపించని ఆ దేవుడికి - తన దేవుణ్ణి కాపాడమని, తనకు దూరం చేయొద్దని, కాదు కూడదూ అంటే తన దేవుడితో తనను తీసుకుపొమ్మని మొరపెట్టుకుంది. పిచ్చి జానకి. కానీ, కనిపించని ఆ దేవుడు జానకి మాటలకి కరిగిపోలేదు. కరుణించలేదు. ఆమె మొర పెట్టుకున్నట్లు - అదీ యిదీ చేయలేదు. ఆమెను 'సగం' గా మిగిల్చి, రాఘవయ్యగార్ని చక్కగా తీసుకు వెళ్లిపోయాడు.

తన 'సగాన్ని' ఆపలేక, 'సగం' గా మిగిలిపోయిన జానకి వార్డంతా దద్దరిల్లేలా అరిచింది.

* * *

రాఘవయ్యగారు అన్ని బంధాలకి అతీతంగా వెళ్ళిపోయారు. స్నేహితులను కున్నవాళ్లంతా చేరి, దహనక్రియలు పూర్తిచేశారు. పదిమందితో కలిసి తిరిగిన మనిషి చివరికి పిడికెడు బుగ్గిగా మారిపోయారు.

అతను వెళ్లిపోయి, ఇరవైనాలుగు గంటలు గడిచిపోయాయి.

ఆ రోజు మధ్యాహ్నం చైతన్య వచ్చాడు. ఇంట్లో వెలితిగాని, తల్లిలో మార్పుగాని చైతన్యలో ఎలాంటి ఆలోచనలు పుట్టించలేదు. ముందు రోజున తన నటనకు ప్రేక్షకులు వినిపించిన చప్పట్లు యింకా అతని చెవుల్లో వినబడుతున్నాయి. తను నటించిన తీరు అతని కళ్లలో చక్కగా కదులుతుంది. మరిచిపోలేని మధురానుభూతితో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు.

రాఘవయ్యగారు ఇంట్లో తిరుగుతున్నట్లు, సరదాగా కబుర్లు చెబుతున్నట్లు, చల్లగా నవ్వుతున్నట్లు - అతని సహచర్యాన్ని పదేపదే తలచుకొని, కుమిలిపోతున్న సమయంలో చైతన్య రావడం చూసి, జానకి భోరున ఏడ్చింది.

తండ్రి పోయాడని తెలుసుకున్న చైతన్య ముఖం తిరిగి అమాంతం నేలకు ఒరిగిపోలేదు. తల్లిని పట్టుకొని కెవ్వున అరవలేదు. పొంగుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక పొర్లిపొర్లి ఏడవలేదు మరేవో చేయలేదు. అతను బాగా నటించగలడు. నాటకంలో తండ్రి పాత్ర 'బక్కెట్టు తన్నితే' ఏడుస్తున్నట్లు నటించి, ప్రేక్షకుల చేత నిజంగా ఏడిపించగలడు. అతని కా టాలెంట్సు ఉన్నాయి. కానీ, జీవితాన్ని నాటకంతో సమన్వయించుకోలేకపోయాడు. తనకు తెలిని వ్యక్తి ఎవరో పోయారనిపించింది అతని మనసుకి. ఆ మనసులో కన్నీళ్లు రాలలేదు. కన్నతల్లి బాధ పడుతుందని మౌనం వహించాడు.

రెండోవాడు శ్రీహరికూడ అదేరోజున సాయంత్రమయేసరికి వచ్చాడు. వస్తూనే సంజాయిషీలూ, క్షమాపణలూ మొదలు పెట్టాడు.

''ఉత్తరం అందిన వెంటనే రావాలనుకున్నాను. మీ కోడలుకూడ వెళ్లమని తొందర చేసింది. కానీ, ఏంచేయనమ్మా?

పెలవు దొరకలేదు. నెలఖరు రోజులు. చాలా యిబ్బంది పడవలసి వచ్చింది. వచ్చీ చెడీ రావాల్సొచ్చింది. ( మా రావాలనుకుంది. కానీ....గాజుపెంకు గుచ్చుకొని, కాలు సెప్టికయింది. ( ల్లేని స్థితిలో ఉంది. చాలా బాధ పడింది అమ్మా...ఏ(విటో ఇలా జరుగుతుందని నే( కల్లోకూడ అనుకోలేదు. ఏదో 'మామూలు సీరియస్' అనుకున్నాను. జరిగినదానికి చాలా బాధ పడుతున్నాను. నాన్న వ సందరికీ అన్యాయం చేశారు. ఈ సంగతి తెలిస్తే మీ కోడలు తట్టుకోలేదమ్మా.. ''

శ్రీహరి చాలా తమాషా మనిషి. మనసులో గుట్టును గుప్పెట్లో దాచి, పైకి మరేదో చెబుతూ ఉంటాడు. నేర్పుతో మాట్లాడి ఎదటవాళ్ళ మనసులో 'నెమ్మది' వెల్లువలా కురిపించాలని ప్రయత్నిస్తాడు. అబద్ధాలకి రంగులు పులిమి, అందమైన నిజాలుగా చూపించాలని ప్రయాసపడతాడు. ఈ 'సీతారావుడు' కోవ్వే అయినా, మాటల్లోనయినా తన అ ంగివి గుర్తు చేసుకోకుండా ఉండలేడు. విషయమేదైనా తప్పంతా తనదని నెత్తిన వేసుకొని, ఆమె పతి ఆమాద ... చాలా తెలివిగా వెనకేసుకు వస్తాడు.


అతని మాటలు ఏవటు జానకికి కొత్త కాదు. పెళ్ళయిన అప్పటికే పెళ్ళాం మాటలు విని, ఉద్యోగం ... చేయించుకొని, ఊరు మార్చి ... పూర్తిగా మారిపోయాడు. తల్లిదండ్రుల్ని మరిచిపోలేదన్నట్లు అప్పుడప్పుడు ఉత్తరాలు మాత్రం రాస్తాడు ... ఎంతో ప్రేమ కురిపిస్తాడు. ... ఎంతెంతో బాధ పడిపోతుంటని ... యిస్తాడు. కానీ, తను ... పడుతున్నట్లు మాత్రం తెలియనివ్వడు. ... తల్లిదండ్రులు ఋణం తీర్చు... అడుగుతారని భయం కాబోలు.

శ్రీహరి చూపిస్తున్న సానుభూతికి జానకి ఏడవలేక నవ్వుకుం .

మర్నాడు-పెద్దవాడు ప్రకాశం భార్యతో కలిసి కారులో వచ్చాడు. అతని ప్రేమకి చిహ్నంగా తనభార్య ఇచ్చిన ముద్దుల కానుక ఆ కారు. ఆ కారూ, ఆమే లేకుండా అతను ఏ షికారూ వెళ్లడు. ఏ ఊరూ ప్రయాణం చేయడు. అతని పరిధి వేరు. ఆ పరిధిలో అతను బంగారు పిచ్చుక.

ప్రకాశం-టెలిగ్రాం అందిన వెంటనే బయలుదేరాలనుకున్నాడు. కానీ, 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' కంపెటిస్ట్ అతన్ని కదలనివ్వలేదు. అతను తీరిక చేసుకొని, వచ్చేసరికి అంతా జరిగిపోయింది. విషయం తెలుసుకొని, తల్లి ముఖంమీద మామూలుగా 'సారీ' పారేశాడు.

రక్తం పంచుకు పుట్టినవాడు ముక్కూ మొహం తెలియని పరాయివాడిలా ప్రవర్తించ ... పరికి జానకి సహించలేకపోయింది. రెచ్చిపోయింది.



''ఒరేయ్....నువ్వు చెప్పే సారీ వినటానికి అతనితో వెళ్ళిపోకుండా నేను బతికున్నాను. ఎంత బాధతో 'సారీ' అని చెప్పావు. 'నీ సానుభూతికి నా బాధంతా మరిచిపోయాను, పెదబాబూ! .... మరిచిపోయాను.''

ప్రకాశం చిరాకుపడ్డాడు.

''కాలం తీరింది. ఆయన పోయారు. నేనేడిస్తే ఆయన తిరిగొస్తారా?''

జానకి పిచ్చిగా, బిగ్గరగా నవ్వింది.

''ఒరేయ్, పెదబాబూ! .... చిన్నతనంలో మీరు నిద్రరాక ఏడిస్తే, అతను జోల పాడేవారు. బడికి వెళ్లకుండా ఏడిస్తే మిమ్మల్ని బుజ్జగించేవారు. ఏదైనా కావాలని మీరు ఏడిస్తే, మీ కళ్లు తుడిచి మీ ముచ్చట్లు తీర్చేవారు. అందుకే అతను వెళ్ళిపోతూకూడ - తనకోసం మీ రేడిస్తే, మీకు ధైర్యంచెప్పి, నా గుండెల్లో మిమ్మల్ని దాచుకోమని చెప్పారు. కానీ, మీకోసం అతను ఎదురుచూసి, ఏడ్చిఏడ్చి కళ్ళు మూశారు.

''నిజం చెప్పావు పెదబాబూ! .... ఏడ్చినా అతడు తిరిగిరారు. నువ్వు ఏడిస్తే నేను ధైర్యం చెప్పాలి. కానీ, నాకా ధైర్యం లేదు. నన్ను శ్రమపెట్టకు ....''

ప్రకాశం భార్య శోభ - అత్తగారు చెట్టంత తన భర్తని అంతలేసి మాటలంటుంటే బాధ పడిపోయింది. ప్రకాశంవేపు అసహనంగా చూపింది. చికాకు పడింది.

''నా పరిస్థితు లేవిటో నీకు చెప్పినా అర్థం కావు. నిన్ననే బొంబాయినుండి వచ్చాను. రాగానే టెలిగ్రాం చూసి, ఇలా బయలుదేరాను'' ప్రకాశం మాటమార్చాడు.

''అవునత్తయ్యా! ....అతనికి క్షణం తీరిక ఉండటం లేదు. మా నాన్నగారికి బాగులేక పోవటంవలన బిజినెస్ అంతా అతనే చూసుకుంటున్నారు'' భర్త తప్పు లేదని శోభ తేల్చిచెప్పింది. అందమైన తన భర్తకి ఒక ముసలితల్లి మిగిలి ఉండటము, ఆ ముసల్ది కొడుకనే హక్కుతో సాధించటం శోభకి సుతరామూ యిష్టం లేదు. ఆయువుచెల్లి 'హరీ' అన్నవాళ్లను వెనకేసుకురావడం ఆమెకు కష్టంగా తోచినది. ఆమె మాటల్లో ప్రకాశం తనవాడు అనే ధోరణి వినిపించింది.

''అవునమ్మా! నేనవన్నీ ఆలోచించ

లేదు. ఏదో ఆవేశంలో అతను పోయారన్న దుఃఖంలో ఏవేవో మాట్లాడేను.... ఒరేయ్ పెదబాబూ! ఆ మాటలు బాధ కలిగిస్తే నన్ను క్షమించు'' ఇప్పుడు ప్రకాశము తనింటి కొడుకు కాదు. ఆ యింటి అల్లుడు. తన కొడుకని స్వతంత్రం చూపిస్తే శోభ సహించలేదు. విలువలు పూర్తిగా మారిపోయాయి.

ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది.

జానకి కళ్ళు ఒత్తుకుంది. తను పూర్వ జన్మలో 'పుణ్యం' చేసుకుందిగాని 'దానం' చేసి ఉండదు. అందుకే తన కడుపున పుట్టినవాళ్ళ దగ్గర ఆత్మీయత సంపాదించుకోలేక పోయింది.

నిజానికి రాఘవయ్యగారు చాలా ఆదర్శముగా బతికారు. పదవిలో మంచిగా తిరిగారు. బతికినంతకాలం అతను ఎవరికీ ఏ విషయంలో అన్యాయం చేయలేదు. అక్రమ సంపాదనలు గడించి, అంతస్తులు పెంచుకోలేదు. అతను ఉన్నతమైన పదవిలో ఉండి, నీతిమాలిన పనులు చేయలేదు. చేసిఉంటే రాఘవయ్యగారు శ్రీమంతుల జాబితాలో ఉండేవారు. కొడుకుల ఆప్యాయతలు సంపాదించుకొనేవారు. కన్నవాళ్లు ఆస్తులకోసం చుట్టూ చేరిఉంటే, అందరి చేతుల్లో అతను చల్లగా కళ్ళు మూసి ఉండేవారు. కానీ, రాఘవయ్యగారు అవేవీ చేయకుండా, కొడుకుల్ని ప్రయోజకుల్ని చేయటం కోసం పాటుపడ్డారు.

ముందు చూపుతో అతను ఆలోచించలేదు. అన్యాయంగా ఆర్జనలుచేసి, ఆస్తులు చూపించకుండా కొడుకుల్ని అన్యాయం చేశారు గనుక ఆ కొడుకులు ఇప్పుడు అన్యాయంగా ప్రవర్తిస్తున్నారు.

ఆలోచనలతో జానకి మనసు చెదిరిపోయింది.

* *

రాత్రి భోజనాలు ముగిశాక అంతా విశ్రాంతిగా కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్న సమయంలో, ఇదే అదననుకొని ''ఇంతకూ మీ అమ్మను ఎవరు తీసుకెళుతున్నారు?'' అని సుందర్రావు కదిపాడు.

ఆ శరాఘాతానికి అంతా తుళ్లిపడ్డారు.

అలాంటి ప్రశ్నొకటి ఎదురవుతుందని ప్రకాశం పొరపాటున కూడా ఊహించలేదు. ఊహించి ఉంటే, ఏదో ఉపాయం ముందుగా ఆలోచించేవాడు. ఆలస్యం అయిందని ఆలోచనలో పడ్డాడు. తను చాలా ఖరీదైన జీవితం అనుభవిస్తున్నాడు. తనను అభిమానిస్తున్నవాళ్లు, ఆదరిస్తున్నవాళ్లు తనకొక పూలకిరీటం తగిలించారు. సమాజంలో 'ఉన్నతి' కల్పించారు. ప్రతి చిన్న విషయానికి తను తలవంచితే కిరీటంలో పూలు రాలిపోతాయి. తను కిందికి జారిపోతాడు. కొత్త జీవితంలో మధురిమ దూరమై పోతుంది. పాతబతుకులో చేదును భరించాలి. తనతో తల్లిని తీసుకు వెళ్ళలేడు. తన స్థానాన్ని చేతులారా పాడుచేసుకోలేడు. శోభతో కలతలు పెంచుకొని కలత పడలేడు.

శ్రీహరి - సుందర్రావు మావయ్య అడిగిన ప్రశ్నకి ఆశ్చర్యపోలేదు. ఆప్రశ్న వస్తుందని అతనికి బాగా తెలుసు. తల్లిని తనతో తీసుకెళ్ళి బరువు బాధ్యతలు పెంచుకోవా లనిపించలేదు. తను పొరపాటుచేస్తే ఇంటిదగ్గర లత తనను క్షమించదు. తప్పించుకోవటానికి తనకు చాలా కారణాలున్నాయి. తనజీతం చాలదనీ, ఇల్లు చాలదనీ, భార్య ఆరోగ్యం బాగులేదనీ, పిల్లల గొడవనీ, తన జీవితం సరిగ్గా లేదనీ, తన తల్లి ఇబ్బంది పడిపోతుందనీ - ఎన్నో చెప్పగలడు. ప్రకాశం అభిప్రాయం విన్న తర్వాతగాని తను సమాధానం చెప్పకూడదనుకున్నాడు. ఆలోచిస్తున్నట్లు ఉండిపోయాడు.

చైతన్య - తనకేమీ ఆ సమస్యతో సంబంధం లేనట్లు ఒక పాతపత్రిక చేతులోకి తీసుకున్నాడు.

వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంది:

ఎవరూ మాట్లాడకపోయేసరికి సుందర్రావు అందరివేపు పరిశీలనగా చూశాడు. తనే మళ్లీ మాట్లాడేడు.

''చైతన్యకు ఉద్యోగం లేదు. వాడికి సంసారమూ లేదు. వాణ్ని ఈ సమస్యకి ముడిపెట్టటం మంచిదికాదు. పెద్దవాళ్లు మీ రిద్దరే ఆలోచించి, ఒక నిర్ణయానికి రావాలి.''

''మామయ్యా! .. నీకు నేను వేరుగా చెప్పక్కరలేదు. ఏ సంపాదనా లేకుండా వాళ్లమీద ఆధారపడి ఉన్నానని నాకెంతో సిగ్గుగా ఉంది. అమ్మను తీసుకెళ్ళి మరీ సిగ్గుపడలేను. నా కాళ్లమీద నిలబడి గలిగినప్పుడు అమ్మను నాతో తీసుకెళతాను'' ప్రకాశం ఖరాఖండిగా చెప్పాడు.

''నువ్వు నీ కాళ్ళమీద నిలబడేసరికి మీ అమ్మ కడతేరిపోతుంది. ఆ రోజు నువ్వు నిజంగా తీసుకెళుదువుగాని. మీ ఇంటికి కాదు. స్మశానానికి' సుందర్రావు ఆవేశంగా అన్నాడు.

''మావయ్యా! నువ్వు ఆవేశపడుతున్నావేగాని నా పరిస్థితేమిటో ఆలోచించటం లేదు.''

''ఆలోచిస్తాను....ఏరా, శ్రీహరీ! .. నువ్వేమంటావ్?''

కాసేపు శ్రీహరి తటపటాయించాడు.

''నాకు అమ్మను తీసుకెళ్లాలనే ఉంది మామయ్యా! .... లత కూడ చాలా సార్లు అంది-అమ్మ తనకు తోడుగా ఉంటే బాగున్నని. కానీ, అమ్మను నా చీకటి బతుకులో ఎలా సుఖపెట్టగలను?''

''నువ్వుకూడా తీసుకువెళ్ళలేనంటావు అవునా?....''

''నా పరిస్థితులు చక్కబడినప్పుడు, అమ్మను తప్పకుండా తీసుకెళతాను.''

''జానకిని తీసుకెళ్లటానికి మీ రిద్దరూ పోటీపడతారనుకున్నాను. ఇలా ఎవరికివారే తప్పుకుంటారని అనుకోలేదు.... వెరీగుడ్. మీరు చాలా మంచి నిర్ణయాలు తీసుకున్నారు.''

''మావయ్యా! అలవాటైన చోటును, అలవాటైన మనుషుల్ని వదిలి ఎక్కడో ఉన్న మాతో ఉండటానికి అమ్మ ఇష్టపడదు. ఇక్కడే అమ్మను ఉండనివ్వండి. అమ్మకు ఏలోటూ లేకుండా చూస్తాను....

ప్రతినెలా డబ్బు పంపిస్తాం'' ఎలాంటి జటిలమైన సమస్యనైనా డబ్బుతో సాధించవచ్చునే నమ్మకం ప్రకాశం[illegible] ఉంది. ఒప్పందము కుదుర్చుకోవటానికి ప్రయత్నంలో పడ్డాడు.

''అవును మావయ్యా నేనూ కొద్దో గొప్పో పంపిస్తాను. అమ్మ జీవితం గడవటానికి మేం పంపించే డబ్బు చాలక పోతుందా?'' శ్రీహరి తామరాకుమీది నీటి బొట్టులా మెల్లగా ప్రకాశం అభిప్రాయాన్ని బలపరిచాడు.

ఆప్యాయతతో, అనురాగంతో ఆదుకోవలసిన కొడుకులు - దిక్కులేక ఒంటరిగా మిగిలిపోయిన తల్లిని పంచుకోవటానికి యిష్టపడక, డబ్బుతో [illegible]లించుకుంటున్నారు.

ఇవి - ఈనాటి మనిషిలో మిగిలి ఉన్న అనుబంధాలు.

ఈ తరంలో కనిపిస్తున్న పచ్చినిజాలు.

అక్కడ కూర్చొని వాళ్ళ సంభాషణ వినాలని జానకికి మనస్కరించలేదు. తన కోసం తనపిల్లలు కొట్లాడుకోవటం చూడాలనిపించలేదు. తను తొడిమలో రాలిపోయే పండుటాకు రాలిపోయే తను ఎవరి దగ్గర చోటు కోరుకోవటం లేదు. ఆమాట అందరిముందు చెప్పి, లేచి వెళ్ళిపోయింది.

సుందర్రావు [illegible] నిట్టూర్చాడు. కడుపున పుట్టినవాళ్ళకి, కన్నతల్లికి మధ్య జరుగుతున్న 'హ్యూమన్ డ్రామా'ను తను ప్రత్యక్షంగా చూస్తున్నాడు. బతుకులో ఎవరికి [illegible] సృష్టించుకుంటున్న కొడుకులు - ఒంటరి బతుకులోకి జారిపోయిన తల్లిని చేరదీయటానికి భయపడుతున్నారు. మనిషిలో మమకారాలు అంతరించి పోతున్నాయి. రోజు రోజుకి పెరిగిపోతున్న స్వార్థం మనిషిని నీడని, వేరుచేస్తుంది.

సుందర్రావు మస్తిష్కంలో అసంఖ్యాకమైన ఆలోచనలు పరుగులు తీశాయి. ఈ 'హ్యూమన్ డ్రామా'లో తను పాత్ర వహించాలి. సామాజికపు విలువలు మరిచిపోయి, స్వార్థంతో నిర్భయంగా బతికేస్తున్న వాళ్ళను 'మనుషులు'గా మార్చాలనిపించింది.


* * *

పూర్తిగా తెల్లవారింది.

చిన్న మామిడిలో కొత్త చిగుళ్ళు తొడుగుతున్నాయి.

మనుషుల్లో సరికొత్త ఆశలు అల్లుకుంటున్నాయి.

జానకి పెరట్లో మామిడి చెట్టుకింద కూర్చుంది. ఏ రాగద్వేషాలు ఆమెలో లేవు. అరిగిపోయిన జీవితంగురించి ఆలోచించటం లేదు. చిగురించే కొత్త భవిష్యత్తును ఊహించుకోవటంలేదు. మసిబారిపోయిన బతుకికి [illegible] పిలుపుకోసం యెదురు చూస్తుంది.



శ్రీహరి-తల్లి దగ్గరకు వచ్చి, ప్రక్కనే కూర్చున్నాడు.

''అమ్మా! రాత్రి నా మాటలకి నొచ్చుకున్నావు కదూ? నా ప్రవర్తనకి నాకే అసహ్యం వేస్తుంది. పాత విషయాల్ని మరిచిపోయి, నన్ను క్షమించమ్మా!''

శ్రీహరి మాటలకి జానకి తెల్లబోయింది.

''అమ్మా! .... నాతో తీసుకెళ్ళాలని నిశ్చయించుకున్నాను. కాదనకుండా రా! మీ కోడలు కూడా సంతోషిస్తుంది.'' ఈ మాటలు చాలా తియ్యగా హాయిగా వినిపించాయి, జానకి మనసుకి. శ్రీహరివేపు చూసింది. చేసిన తప్పుకి సిగ్గుపడుతున్నట్లు తలవంచుకున్నాడు. అతని కళ్ళలోఎన్నెన్నో భావాలు కనిపిస్తున్నాయి. మనిషిలో మార్పు ఇంత తొందరగా వస్తుందనుకోలేదు. ఆ పిలుపుకి ఆమె సంబరపడిపోయింది. ఎవరూ తనను తీసుకెళ్ళకపోయినా పరవాలేదు. తనను తనపిల్లలు మరిచిపోకుండా ఉంటే చాలు. చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకోకుండా ఉండలేకపోయింది.

ప్రకాశం, శోభకూడ అచ్చం శ్రీహరి లాగే జానకిని అడిగారు. క్షమించమన్నారు. క్షమించి, తమతో రమ్మన్నారు.

''అమ్మా! ఈరోజు చాలా మంచిదట. నువ్వు బయలుదేరితే అంతా కారులో వెళ్ళిపోవచ్చు .... అక్కడ నీకెలాంటి లోటు రాకుండా చూసుకుంటాం'' ప్రకాశం బతిమిలాడేడు.

''అతని మాటను కాదనకండత్తయ్యా! బయలుదేరండి'' శోభ అత్తగారి చేతులు పట్టుకుంది.

వాళ్ళలో అర్ధాంతరంగా పుట్టుకొచ్చిన అవ్యాజమైన ఆదరణకి అర్థం ఏమిటో ఊహించలేకపోయింది జానకి. కొడుకులు చూపిస్తున్న ఆప్యాయతకి తట్టుకోలేకపోయింది. వాళ్ళలో కలిగిన మార్పుకి మనసంతా తృప్తితో నిండిపోయింది.

ప్రకాశం, శ్రీహరి-తల్లిని తీసుకువెళ్ళటానికి వాదించుకుంటున్నారు.

తను చాలా అదృష్టవంతురాలు. తనను వెలివేశారనుకున్న కొడుకులు, చేరదీయటానికి పోటీపడుతున్నారు. ఏ చోటూ లేదనుకున్న తనకు - వాళ్ళ హృదయాల్లో శాశ్వతమైన చోటును ప్రసాదిస్తున్నారు. ఎవరి సమస్యలకి వాళ్ళు అతుక్కుపోయారనుకున్న వాళ్ళు తనను సాదరంగా ఆహ్వా

నిస్తున్నారు. కొన్నిక్షణాల ఆ స్రవంతిలో జానకి కొట్టుకుపోయింది.

ఆమెలో ఆనందం ఎంతోసేపు నిలవలేదు. మహాసముద్రాలు విజృంభించాయి. బడబాగ్ని మొదలయింది

"అమ్మను ఎవరైనా తీసుకెళ్ళండి. నాకెలాంటి అభ్యంతరం లేదు. కానీ, నాకు ఉద్యోగం లేదు. మీలా నాన్న నన్నొక దారిలో పెట్టలేదు. నేను బతకటానికి, నాకొకదారి దొరకటానికి ఆ డబ్బులో నాకు సగంవాటా కావాలి" చైతన్య తల్లిని తీసుకెళ్ళటానికి వాదోపవాదాలు చేసుకొంటున్న పెద్దవాళ్ళిద్దరికీ ఖచితంగా చెప్పాడు.

చైతన్య మాటలు జానకికి అర్థం కాలేదు. చైతన్యవేపు ప్రశ్నార్థకంగా చూసింది.

"నాన్న నీపేర పెద్ద మొత్తం ఇన్సూర్ చేశారమ్మా! మావయ్య చెప్పాడు. అందులో న్యాయంగా నాకు సగంవాటా ఇమ్మని అడుగుతున్నాను. న్యాయం కాదంటావా?"

పెద్దవాళ్ళిద్దరూ మౌనం వహించారు.

నిజం తెలుసుకొన్న జానకి అవమానంతో కుంచించుకుపోయింది. ఊహించుకున్న స్వర్గం ఊహకందని అగాధాల్లోకి జారిపోతుంటే వెర్రిగా కొన్నిక్షణాలు ఎటో చూస్తూ ఉండిపోయింది. నిన్నటివరకు తనను చీదరించుకొన్నవాళ్లు ఈరోజు వల్లమాలిన అభిమానంతో ముందుకు వస్తుంటే 'నిజం' అని తనెలా నమ్మగలిగింది! కనువిప్పుకలిగి మారిపోయారని, డబ్బుమీద కాపీనంతో తనను కావాలనుకుంటున్నారని ఎందుకు ఆలోచించలేకపోయింది?

నిజం బద్దలయి, కడుపున పుట్టినవాళ్ళ బలహీనతలు బయటపడ్డాయి. ఆమెలో ఆవేశం కట్టలుతెంచుకుంది.

"డబ్బు...డబ్బు.. డబ్బు మీరు డబ్బు మనుషులు. మీకు డబ్బు కావాలి. ఏ బంధాలూ వద్దు. ఉన్నవాడికి, ఉండీ లేనివాడికి, లేనివాడికి డబ్బే అవసరం అయింది. ఒక చిన్న అబద్ధాన్ని నమ్మి, డబ్బుకోసం అమాంతం నామీద ఆప్యాయత కురిపించారు. ప్రేమగా నటించారు. నన్ను పంచుకోవటానికి పోటీపడ్డారు. మీ గుండెల్లో నాకు చోటుందని ప్రతి తల్లిలాగే నేను తృప్తిపడిపోయాను. మీ ఆంతర్యాలు అర్థం చేసుకోలేక పోయాను. అంతా నిజం అనుకొని మోసపోయాను. భ్రమతో కొట్టుకుపోయాను.

'డబ్బుముందు 'ఏమీ' ఏమీకాదు ఈ నిజం మీనాన్నకు తెలీదు. తెలిసిఉంటే అతను మీకు 'డబ్బు' ఇచ్చి, ప్రేమను కొనుక్కొనేవాడు. మీరంతా నన్ను నెత్తిన పెట్టుకొనేవాళ్ళు. పొరపాటు జరిగిపోయింది. మీ నాన్న మీకుచేసిన అన్యాయానికి నన్ను క్షమించమని అడుగుతున్నాను. క్షమించండి" ఆవేశంతో జానకి ఊగిపోయింది.

అప్పుడే వచ్చిన సుందరరావు ప్రసన్నుడిపోయాడు.

"అమ్మా, జానకీ! వాళ్ళపిల్లలుకూడా జీవితం చివరదశలో వాళ్ళను నిలదీసిననాడు ఆరోజు తల్లిదండ్రులుగా తల్లిదండ్రుల ఆవేదన అర్థం చేసుకుంటారు."

"వాళ్ల పొరపాటు చేయరన్నయ్యా! వాళ్ళ పిల్లలచేత వేలెత్తి చూపించుకొనే తెలివితక్కువ వాళ్లుకాదు నా కొడుకులు."

జానకి వలవలా ఏడ్చింది.

"జానకీ! తోడబుట్టినవాణ్ణి నేను బతికే ఉన్నానమ్మా. ఈ అన్నయ్య గుండెల్లో నీకు ఎప్పుడూ చోటుంది. నాతో మా ఇంటికి రామ్మా" సుందరరావులో పాత బంధాలు ఇంకా పట్టుగానే ఉన్నాయి. అవి తెగిపోలేదు, తెగిపోవుకూడ.

"వద్దన్నయ్యా నేను బతకలేను, వచ్చే జన్మలో ఆస్తి ఐశ్వర్యమూ ఇచ్చిన తర్వాతే పిల్లల్ని ఇమ్మని దేవుణ్ణి కోరుకుంటాను. మీఇంటికి రాలేనన్నయ్యా. నన్ను క్షమించు." జానకి హీనస్వరంతో అంది. మాట్లాడుతూ నెమ్మదిగా నేలకు ఒరిగిపోయింది.

స్వార్థం-మృత్యువు ఒకటే. ఈ రెండింటిలో మనిషి దేనిని జయించలేకపోతున్నాడు.

★★★

## దీపావళి

వెన్నెల రోజు-
ఇది వెన్నెల రోజు
అమావాస్యనాడు వచ్చే
పున్నమి రోజు.

పెద్దలంతా పిల్లలుగా
మారే రోజు
పల్లేదో పట్టణమేదో-
తెలియని రోజు
దీపావళి రోజు.

చంటిపాప నవ్వులకు-
పువ్వులు విరిసే రోజు
మింటనున్న తారకలు-
ఇంటింటా వెలిగే
దీపావళి రోజు.

జీవితం క్షణికమని-
చిచ్చుబుడ్డి చెపుతుంది
గువ్వల్లె బ్రతకాలని-
తారాజువ్వ చెపుతుంది
నిప్పుతోటి చెలగాటం-
ముప్పు తెచ్చి పెడుతుందని
తానందుకు సాక్ష్యమని-
టపాకాయ చెపుతుంది.

వెన్నెల రోజు-
ఇది వెన్నెల రోజు
అమావాస్యనాడు వచ్చే
పున్నమి రోజు.

—'మల్లెమాల'